భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు

- అవసరమైన పనులు ప్రారంభించాలి
- ప్రతి సౌకర్యం ప్రజలకు ఉపయోగపడాలి
- ఐటీడీఏ పీవో అంకిత్
- మహాజాతరపై అధికారులతో సమావేశం
- మేడారంలో పలు ప్రాంతాల పరిశీలన

మేడారంలోని జంపన్నవాగు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో అంకిత్

తాడ్వాయి, డిసెంబర్ 12 : వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మేడారంలో మంగళవారం గ్రామీణ నీటి పారుదల, విద్యుత్, గిరిజన సంక్షేమం, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో కల్పించనున్న సౌకర్యాలు, జాతర కోసం ప్రతిపాదించిన పనులు, సిబ్బంది సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకలగుట్ట, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రస్తుతం జాతర పరిసరాల్లోని మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, ఇన్‌ఫిల్టరేషన్ బావులు, దుస్తులు మార్చుకునే గదులు, లైటింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల ఏర్పాటు తదితర పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతరలో ఏర్పాటు చేసే ప్రతి సౌకర్యం భక్తులకు అందేలా చూడాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారం మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, అధికారులు మహాజాతర ఏర్పాట్ల వివరాలను సిద్ధం చేసుకోవాలని అంకిత్ సూచించారు.

సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

మంత్రిని కలిసిన అధికారులు, నాయకులు

ములుగు రూరల్, డిసెంబర్ 12 : రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, కాసింపేటపేట సర్పంచ్ అహ్మద్‌పాషా హైదరాబాద్‌లో వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీతక్కకు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కలిసేందుకు రావొద్దు

కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ఉమ్మడి జిల్లా అధికారులు, అభిమానులు తనను కలిసేందుకు హైదరాబాద్‌కు రావొద్దని మంత్రి సీతక్క మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తనను కలిసేందుకు వస్తున్నారని, మరో రెండు రోజుల్లో తాను ములుగు రానున్నట్లు వివరించారు. ములుగులో అందరినీ కలుస్తానని సీతక్క వివరించారు.

మంగపేట నుంచి..

మంగపేట : మంత్రి సీతక్కను మంగళవారం మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ ములుగు జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, నాయకులు గంగెర్ల రాజారత్నం, మాజీ ఆత్మ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీహరి, గంగెర్ల రఘు, తదితరులున్నారు.

వాజేడు నుంచి

వాజేడు : రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మండలంలోని అయ్యవారిపేట, ధర్మవరం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కలిసిన వారిలో పలిశెట్టి శ్రీనివాస్, కళేశ్వరాపు సర్వేశ్వరరావు, బచ్చు రాము, బంధం కృష్ణ, గగ్గూరి అశోక్, బోల్లె వెంకటేశ్వర్లు, తుండి రాజబాబు తదితరులున్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

గోవిందరావుపేట, డిసెంబర్ 12 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి, నల్లా పన్నుల వసూళ్లపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే పన్నుల వసూళ్లలో మండలాన్ని మొదటి స్థానంలో నిలిపేలా ప్రతి కార్యదర్శి పనిచేయాలని, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. అలాగే ఈజీఎస్ పన్నుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ఉపాధి పనులు జరిపించాలన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న జీపీ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితా, రిజర్వేషన్లలో తప్పులు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో సాజిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవో

సుబ్రహ్మణ్య భారతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఘనంగా భారతీయ భాషా దివస్

ములుగు రూరల్, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో మంగళవారం ఘనంగా భారతీయ భాషా దివస్ నిర్వహించారు. విద్యాశాఖ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లోని ప్రజల మధ్య భాషా సామరస్యం స్పష్టించడానికి, భారతీయ భాషలను నేర్చుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని విద్యా సంస్థలు డిసెంబర్ 12న సుబ్రహ్మణ్య జయంతిని పురస్కరించుకొని భారతీయ భాషా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది సాంబయ్య, జయదేవ్, విక్రమ్‌రాజ్, మనోహర్‌రావు, ఫిరోజ్, భారత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జాతీయ మిర్చి బోర్డు సభ్యుడు

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు పుష్ప గుచ్ఛం ఇస్తున్న సాంబశివరెడ్డి

మంగపేట, డిసెంబర్ 12 : మండలంలోని అకినేపల్లిమల్లారానికి చెందిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి మంగళవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న ఎత్తిపోతల పథకాలు, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలను ఆధునీకరించాలని, వరి పంటకు బోనస్ ప్రకటించాలని, కొత్తగూడెం, అకినేపల్లిమల్లారం గ్రామాలకు పల్లె వెలుగు బస్సు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినట్లు సాంబశివరెడ్డి వివరించారు. ఆయన వెంట స్థానిక రైతు బంధు కోఆర్డినేటర్ పాడి దామోదర్‌రెడ్డి, కార్తీక్, బాలాజీ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

తరగతి గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 12 : మండలంలోని ఆలుబాక, తిప్పాపురం, ముత్తారం గ్రామాల్లోనని పోలింగ్ స్టేషన్లను ములుగు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ మంగళవారం సందర్శించారు. అనంతరం ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సమ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, సర్పంచ్ బాడిసె సత్యం తదితరులున్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు సుమలత

ఏటూరునాగారం, డిసెంబర్ 12 : మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సెంటర్‌కు వచ్చిన మహిళలకు వ్యాధులపై వైద్యురాలు సుమలత అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ సెంటర్‌ను మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి వ్యాధులున్నా సెంటర్‌కు వచ్చి వైద్యమే కాకుండా సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన హెచ్ఎం

గోవిందరావుపేట, డిసెంబర్12 : మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలను ఎంఎన్‌వో స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సోమారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం నుంచి సాయత్రం వరకు తొలిమెట్టుకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఉన్న పట్టును పరీక్షించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సోమారెడ్డి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చిట్యాల, డిసెంబర్ 12 : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భూపాలపల్లి సీడీపీవో అవంతి అన్నారు. మండలంలోని తిరుమలాపూర్ అంగన్‌వాడీ 1, 2 కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ప్రభుత్వం అందిస్తున్న భోజనాన్ని భుజించాలన్నారు. ఆహారంలో ఆకుకూరలు, పాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు కవిత, త్రివేణి, రమణమ్మ తదితరులున్నారు.

ఎడ్జర్లపల్లి, బొమ్మనపల్లిలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మధూకర్

వాజేడు, డిసెంబర్ 12 : మండలంలోని ఎడ్జర్లపల్లి జీపీలోని ఎడ్జర్లపల్లి పాతూరు, బొమ్మనపల్లిలో మంగళవారం వైద్యాధికారి మధూకర్ నేతృత్వంలో శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. క్షయవ్యాధి గ్రస్తులను పరీక్షించి వారికి నెలసరి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్లు కోటిరెడ్డి, వెంకటరమణ, సీహెచ్‌వో సూర్యప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.